క్లుప్తంగా

ముగిసిన నాగారపమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ

సంబేపల్లి : నాగారపమ్మ జాతర మంగళవారం ఘనంగా ముగిసింది. పూలు, విద్యుత్‌దీపాలతో అమ్మవారి గర్భగుడిని అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. సంతానం లేని మహిళలు సంతానం కోసం ఆలయ ప్రాంగణంలో వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు చాందీనిబండ్లు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రెండు ఇసుక ట్రాక్టర్‌లు స్వాధీనం

సిద్దవటం : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను మంగళవారం స్వా. దీనం చేసుకున్నామని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో మండలంలోని టక్కోలి పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టక్కోలి గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకొని సిద్దవటం పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మేరకు నిత్యపూజయ్య, చెంద్రాయుడులపై కేసునమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

కుక్కలదొడ్డిలో గంగమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకున్న కొల్లం గంగిరెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కుక్కలదొడ్డి గ్రామంలో గంగమ్మ జాతరను మంగళవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. జాతర పురస్కరించుకొని చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ మండల నాగేంద్ర. పార్టీ పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆటో బోల్తా ; ఇద్దరికి గాయాలు

రైల్వేకోడూరు : కుక్కలదొడ్డి సమీపంలో మంగళవారం సాయంత్రం ఆటో బోల్తా పడిన సంఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలైనట్టు స్థానికులు తెలిపారు. వివరాలు.. కోడూరు నుంచి రేణిగుంట వైపు వెళ్తున్న ఆటో కుక్కలదొడ్డి సమీపంలోని బ్రిడ్జి వద్ద ముందు వైపు వెళ్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో ఆటో బోల్తాపడినట్టు స్థానికులు పేర్కొన్నారు. ఈ సంఘటనలో ఆటో పాక్షికంగా దెబ్బతిన్నట్టు, గాయపడిన ఇద్దరిని చికిత్స కోసం రేణిగుంట ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

రామాపురం : దర్బారు సాయి నగరంలో వెలసిన సాయినాథుని 25వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 8గంటల నుంచి షోడశ పూజలు, పంచామృత అభిషేకం, బెంగళూరుకు చెందిన నరేంద్ర ఆచార్యులచే హోమం జరిపారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పల్లకీ సేవలో సాయినాథుని ఊరేగించారు. సేజ్ హారతితో ఉత్సవాలు ముగిశాయి.

మజ్జిగ పంపిణీ

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు హరినాథరెడ్డి సతీమణి సునీతమ్మ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కంసల వీధిలోని హరి పాపులర్ షూ కంపెనీ వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్, సభ్యులు కిషోర్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఆర్.కె.కిషోర్, దాత హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి గుండ్లూరు మూలస్థానమ్మ తిరునాల

కలికిరి: మండలంలోని గుండ్లూరులో వెలసిన శ్రీదేశాయి మూలస్థానమ్మ వార్షిక ఉత్సవాలలో భాగంగా జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు తిరునాల నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రజల ఆశీస్సులే సీఎం జగన్‌కు శ్రీరామరక్ష

రాజంపేట టౌన్ : ప్రజల ఆశీస్సులే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి శ్రీరామరక్ష అని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. జగన్ ప్రజారంజక పాలన దిగ్విజయంగా నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ఆకేపాటి భవన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జెడ్పీ చైర్మన్ కేక్‌కట్ చేశారు. పార్టీ శ్రేణులకు స్వయంగా కేక్ తినిపించి తన ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం అనతికాలంలోనే 98.5 శాతం హామీలను నెరవేర్చారన్నారు. ఈ ఘనత ఒక్క జగన్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు. పేదల గురించి ఆలోచించే ఏకైక నాయకుడు జగన్ అన్నారు. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను చంద్రబాబు సమాధులతో పోల్చడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు పేదల వ్యతిరేకి అని ఆరోపించారు. విద్య, ఆరోగ్యం పట్ల ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలు ఏకమై పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గత ఎన్నికల్లో కంటే ఎక్కువ స్థానాల్లో విజయం సాధించి జగన్ మళ్లీ సీఎం అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, ప్రభుత్వ న్యాయవాది వంకన గురుప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, మర్రి రవి, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, గంగిరెడ్డి, సనిశెట్టి నవీన్‌కుమార్, మిర్యాల సురేఖ, జేసీబీ సుబ్బారెడ్డి, సౌమిత్రి, డీలర్ సుబ్బరామిరెడ్డి, దండు గోపి, దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో పంజం ఆధ్వర్యంలో..

రైల్వేకోడూరు : వైఎస్సార్‌సీపీ విజయం సాధించి నాలుగు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. అనంతరం కార్యాలయంలో స్వీట్స్ పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తిరుగులేని విజయాన్ని అందించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజారంజక పాలన అందిస్తున్న జగనన్న 2024లోనూ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, గతంలో కంటే ఎక్కువ స్థానాలు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు చల్లని దీవెనలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తిరిగి ప్రజలు పట్టం కడతారని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పడినా ప్రజలు వైఎస్సార్‌సీపీకే అండగా ఉండి విజయానికి సైనికుల్లాగా నడుం బిగిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెట్పీటీసీ రత్నమ్మ, ఉప సర్పంచ్ తోట శివసాయి, కొరెడ్డి సిద్దయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సీహెచ్ రమేష్, గునిశెట్టి రమేష్, హరిక్రిష్ణారెడ్డి, మల్లు క్రిష్ణారెడ్డి, బండారు మల్లి, జనార్దన్‌రాజు, ఆకేపాటి రంగారెడ్డి, శ్రీరామ్ వినోద్, నందబాల, రౌఫ్, వెంకటరెడ్డి, దామర్ల సిద్దయ్య, బత్తల సుబ్రమణ్యం, మస్తాన్, వైఎస్ కరీముల్లా, వినోద్ ఖన్నా, ఏడుక అంజి, శంకర, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బైక్ ర్యాలీలో నాయకులు పాల్గొన్నారు.



రాయచోటి టౌన్: సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాజంపేట టౌన్: పోలాకు కేక్ తినిపిస్తున్న ఆకేపాటి



రైల్వేకోడూరు: ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వైపు దేశం చూస్తోందని రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా అన్నారు. మంగళవారం ఆయన రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కార్యాలయంలో ప్రభుత్వం నాలుగు సంవత్సరాల పాలనను విజయవంతం విజయం చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలోమున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజూర్ రహిమాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్, కొలిమి చాన్ బాషా, మదనపల్లె పరిశీలకుడు హబీబ్‌ఖాన్, మూసా, ప్రసాద్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సిద్దవటం : మండలంలోని ఎస్. రాజంపేట గ్రామానికి చెందిన శ్రీ విన్యా (18) అనే యువతి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ విన్యా ఇంటర్ చదివి ఖాళీగా ఉందన్నారు. ఈమె సోమవారం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఆమె తల్లి లక్ష్మిదేవి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు వార్షికోత్సవ పూజలు



శీతల గంగమ్మ మూలవిరాట్

సిద్దవటం : మండలంలోని మాధవరం - 1 గ్రామ పంచాయతీ పార్వతీపురం గ్రామంలో వెలసిన శీతల గంగమ్మ అమ్మవారికి బుధవారం 20వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ఉదయం 5 గంటలకు 108 బిందెలతో జలాభిషేకం అనంతరం చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలి

పీలేరు : పంచాయతీ పరిధిలో మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు.

హామీలను నేరవేర్చాం.. మాట నిలబెట్టుకున్నాం

> వైఎస్ జగన్ ప్రభుత్వం నాలుగు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా

సుండుపల్లి(రాజంపేట): సంక్షేమ ప్రభుత్వం నాలుగు వసంతాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చి మాట నిలబెట్టుకుంటూ ముందుకు సాగిందని మంగళవారం రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టిన మంగళవారంతో నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా సుండుపల్లె మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం రోజు నుంచి పాదయాత్రలో ఏదైతే మాట ఇచ్చారో అదే విధంగా ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, మహిళల సాధికారిత అభివృద్ధి దిశగా పాలన సాగిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇస్మాయిల్, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ రెహమాన్ ఖాన్, సర్పంచులు షరీఫ్, సరోజ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామస్వామి రెడ్డి, ఆనందరెడ్డి, వీరనాగిరెడ్డి, విజయసారధి రాజు, భానుప్రకాష్‌రెడ్డి, పవన్ రెడ్డి, అబ్దుల్లా, రహీం బాషా, తిమ్మ సముద్రం శంకర్, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

దుకాణాలను స్వచ్ఛందంగా ఖాళీ చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం నుంచి ఒంటిమిట్ట బస్టాండు వరకు ఇరువైపుల ఉన్న దుకాణాలు, గృహాలను స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని దుకాణాల యజమానులు, ప్రజలకు ఒంటిమిట్ట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలియజేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో రామాలయం వద్ద నుంచి బస్టాండు వరకు ఉన్న దుకాణాలు, గృహాల యజమానులతో తహసీల్దార్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ దుకాణాలు, గృహాలను ఖాళీ చేయాలని, ఖాళీ చేసినందుకు గాను వారికి పునరావాసం కల్పించి, దుకాణాదారులకు ఒంటిమిట్ట రామయ్య ఆలయానికి 1000 మీటర్ల దూరంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇస్తామన్నారు. ఆలయం నుంచి బస్టాండు వరకు ఇరువైపులా స్థలాలు ఉన్నవారు మొత్తం 114 మంది ఉన్నారన్నారు. వీరే కాకుండా ఇంకా ఎవరైనా మిగిలి పోయి ఉంటే తిరిగి 10 రోజుల తరువాత మళ్లీ సమావేశం నిర్వహించనపుడు హాజరై, వారి సమస్యలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రంగయ్య, ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి పాల్గొన్నారు.

అంజనేయుడికి ఘనంగా గ్రామోత్సవం



రైల్వేకోడూరు అర్బన్: పూజలందుకున్న ఆంజనేయుడు

ఓబులవారిపల్లె : బొమ్మవరం గ్రామంలో శాతవాహన రాజుల కాలంలో ప్రతిష్టింపబడిన ఆంజనేయ స్వామికి మంగళవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో స్వామికి కాయాకర్పూరం సమర్పించి పూజలు జరిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గడ్డం రామచంద్రరాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.గౌరిశంకర్‌రాజు, సర్పంచ్ లౌడి గంగురాజు, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, వైఎస్సార్ పార్టీ నాయకులు గడ్డం చెంగల్‌రాయుడు, చేజర్ల సుబ్రమణ్యంరాజు గడ్డం వెంకటేశ్వరాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్: పట్టణంలోని ఆంజనేయుడి దేవాలయంలో స్వామి వారికి మంగళవారం విశేష పూజలు జరిపారు.

ఏపీఎండీసీ వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆధ్యా మెడికల్ సర్వీసెస్ అధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సీపీఓ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీఎండీసీ ఉద్యోగులకు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రతి నెల ఏపీఎండీసీ ఆరోగ్యకేంద్రంలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతి నుంచి స్పెషలిస్టు వైద్యులచే ఊపిరితిత్తులు, ఎముకలు, దంతాలకు సంబంధించి ప్రజలకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దాదాపు 150 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు రామంజనేయులు, స్పెషలిస్టు వైద్యులు ఎంఎం కూమార్, ఎం.సురేష్, ఎస్.అమూల్య, వినిత, ఆధ్యా మేనేజర్ ఆశోక్‌కుమార్, సిబ్బంది దిలీప్ పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో కూలీలకు గాయాలు



గాయపడిన వారిని పరామర్శిస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. మండలంలోని మిట్టమీదపల్లె పంచాయతీలో మంగళవారం జరిగిన ఈ ఘటనలో ఎనిమిది మంది కూలీలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం రాజంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. కాగా గాయపడిన వారిని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సౌమిత్రి, దాసరి పెంచలయ్య పాల్గొన్నారు.

పశు విజ్ఞానబడిని సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పశువిజ్ఞానబడిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వేపులబైలు పంచాయతీ రెడ్డివారిపల్లెలో పశువిజ్ఞానబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే పరిధిలోని పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు పదిహేనురోజులకోసారి ప్రత్యేకంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాడి రైతుల పశుపోషణకోసం మొక్కజొన్న విత్తనాలు 8600 కేజీలు, జొన్న 6700 కేజీలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వ రాయితీతో ఇచ్చే విత్తనాలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని పలువురు వైఎస్ఆర్ సీపీ, టీడీపీ నేతలకు రాష్ట్రమహాసభల ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 27 నుంచి 30వ తేదీ వరకు రాయచోటి పట్టణంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. మహాసభలు వరుసగా 3 రోజులపాటు నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో నిర్వహింప తలపెట్టామన్నారు. గిరిజన సమస్యల పరిష్కారం కోసం గిరిజన సమాఖ్య పాలకపక్షాలపై నిరంతరం పోరాటం జరుపుతుందన్నారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్, సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

పీఎంజేజేవై బీమా ఒక వరం



బీమా చెక్కును అందిస్తున్న మేనేజర్ మంజుల

రామాపురం : ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన నిరాశ్రయ కుటుంబాలకు ఒక వరం లాంటిదని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మంజుల అన్నారు. ఆమె మంగళవారం మండలంలోని సుద్దమళ్ల గ్రామం దూదేకులపల్లెకి చెందిన పెద్ద పుత్త హుసేన్ బీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. హుసేన్ బీ కుమారుడు అక్బర్‌కు రూ.2లక్షలు బీమా చెక్కును మేనేజర్ మంజుల, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనులు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

90 మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ కాప్పల్లి క్రాస్ వద్ద ఎస్ఐ రవీంద్ర బాబు మంగళవారం సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో బూర్లపల్లి హరిజన వాడకు చెందిన చిన్నగూటం నరేష్ కర్నాటక రాష్ట్రం నుంచి ప్లాస్టిక్ సంచితో వస్తుండగా అనుమానంతో పోలీసులు తనిఖీ చేశారు. 90 ప్యాకెట్ల అక్రమ మద్యం సంచిలో ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాల ధ్వజారోహణం



పురవీధులలో ఊరేగుతున్న వేణుగోపాల స్వామి



ధ్వజారోహణం నిర్వహించిన దృశ్యం

పెనగలూరు : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు మధ్య కార్యక్రమం జరిపారు. ఆలయంలో గతంలో ఉన్న ధ్వజస్తంభాన్ని తొలగించి రాతి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ధ్వజారోహణ అనంతరం రుక్మిణీ, సత్యభామలు, వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగించారు. ధ్వజారోహణ కార్యక్రమం వడ్డెర సంఘం వారు నిర్వహించినట్టు ఆలయ చైర్మన్ సుబ్బారెడ్డి, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు తెలిపారు.

3 నుంచి సబ్సిడీ విత్తనకాయల పంపిణీ

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని 11 రైతు భరోసా కేంద్రాల ద్వారా జూన్ 3వ తేదీ నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్ తెలిపారు. సబ్సిడీ విత్తన కాయల కోసం రైతులు ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన తెలిపారు. మండలానికి 1800 క్వింటాళ్ల విత్తనకాయలు రానున్నాయన్నారు. ప్రస్తుతం కే6 రకం 210, నారాయణి 140 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, రైతులందరూ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న తరువాత విత్తనకాయలు పంపిణీ చేస్తామన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోండి

పుల్లంపేట : పచ్చిరొట్ట ఎరువులను 50 శాతం సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని వ్యవసాయ అధికారి కృష్ణ చైతన్య కోరారు. జనుములు పది కేజీలకుగాను రూ. 420లు మాత్రమే చెల్లించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంపిణీకి సిద్ధంగా జనుములు

రైల్వేకోడూరు అర్బన్ : రైతులకు పచ్చిరొట్ట ఎరువులలో భాగంగా జనుములు బుధవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఏఓ సుధాకర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 50 శాతం సబ్సిడీపై జనుములు పంపిణీ చేస్తామన్నారు. ఎకరాకు 10 కేజీల బస్తా చొప్పున 5 ఎకరాల వరకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 10 కేజీలు 840 రూపాయలయ్యేది 50 శాతంతో 420 రూపాయల అవుతుందన్నారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

ఘనంగా సీఐటీయూ వ్యవస్థాపక దినోత్సవం



సీఐటీయూ జెండాకు విప్లవ వందనం చేస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం సీఐటీయూ 54వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత జెండాను ఎగురవేసి విప్లవ వందనం చేశారు. అనంతరం రవికుమార్ విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. అదానీ, అంబానీలను ప్రపంచ కుబేరులను చేయడమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేటీకరణ చేస్తున్నారని, దీంతో ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల సమస్యలపై సీఐటీయూ తరపున నిరంతరం పోరాడుతూనే ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈశ్వరమ్మ, శివరంజని, ప్రసాద్, రవిశంకర్, లక్ష్మీదేవి, శంకర్, సుబ్రమణ్యం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



దెబ్బతిన్న మామిడి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సుండుపల్లె (రాజంపేట) : సుండుపల్లెలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకుంటామని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. భారీ వర్షానికి మండలంలో దెబ్బతిన్న పంటలను మంగళవారం మేడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సుండుపల్లె దిగువ గుల్లవాండ్లపల్లెలో పెనుగాలులకి ఇళ్లు దెబ్బతిన్న వారిని పరామర్శించారు.

ఇళ్లు దెబ్బతిన్న ప్రతి ఒక్కరికి తక్షణమే నూతన ఇళ్లను మంజూరు చేయాలని స్థానిక తహసీల్దార్‌ని ఆయన ఆదేశించారు. అనంతరం దెబ్బతిన్న మామిడి రైతులను ఆయన పరామర్శించారు. ప్రకృతి ప్రకోపం వలన ఇలాంటి పరిస్థితులు ఏర్పడటం దౌర్భాగ్యమని, కంటికి రెప్పలా కాపాడుకున్న మామిడి చెట్లు రైతులు కోల్పోవడం చాలా బాధాకరమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి ఈ పరిస్థితులను తీసుకువెళ్లి తప్పక న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ చాంద్, ఎంపీడీఓ రామచంద్ర, ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, హెచ్ఓ వనితా బాయ్, విద్యుత్ ఏఈ రమేష్, జెడ్పీటీసీ ఇస్మాయిల్, జేసీఎస్ కన్వీనర్ రెహమాన్ ఖాన్, సర్పంచులు షరీఫ్, సరోజా నాయక్, ఎస్.ఆంజనేయులు, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, రహీం బాషా, పవన్ రెడ్డి, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.